

# బిందీ

**—చిలుకూరి దేవపుత్ర**

## కథాప్రభ

ఊహించని విధంగా జీవితాన్ని మలువులు తిప్పేదే కాలం అనిపిస్తుంది నాకు. మరి ఎవరైనా అయితే 'కాలం' స్థానంలో 'విధి'ని చేర్చుకుని ఉండేవాళ్లు. నేను నాస్తికుణ్నీ హేతువాదినీ అవడం వల్ల విధిని ఎలా నమ్ముతాను! అది హేతువాదానికి నిలబడనిది కదా!

*** **** ****

పిండారబోసినట్లుగా వెన్నెల కురిపిస్తున్నాడు చంద్రుడు. 'విశాల బారు' గార్డెన్‌లోని ఒక మూలలో నేనూ, మా సహోద్యోగులు నలుగురూ - అంజనేయులు, శివరాం, రాజేశ్వరరావు, వెంకటేశం విస్కీ తాగుతూ ఉన్నారు. నేను 'లిమ్కా' తాగుతున్నాను. వెంకటేశానికి ప్రమోషను వచ్చినందువల్ల మా అందరికీ పార్టీ ఇస్తున్నాడు.

"కరుణాకరం! నీ సంగతే నాకు అర్థం కావడంలేదు. దయచేసి ఒక్క పెగ్గు తాగి చూడు, నీ సిగరెట్టుకు మరింత రుచిగా ఉంటుంది. ప్లీజ్, ఒక్క పెగ్గు!" అంటూ నన్ను బతిమాలుతున్నాడు అంజనేయులు. అతను మా అందరిలోకీ వయసులో పెద్ద. అయినా కలుపుగోరు మనిషి అవడం వల్ల మేమంతా అతన్ని మా వయసు వాడిగానే లెక్క వేసుకుంటాం. అతని మాటలకు సమాధాన మివ్వకుండా నవ్వి ఊరుకున్నాను.

"నువ్వేం రైటరువో, ఏమో అర్థమే కాదప్పా! మందు కొట్టవూ, మజా చెయ్యవూ! పైగా నాస్తికుడివి - దేవున్ని మొక్కవూ, దయ్యాన్నీ మొక్కవూ! వేస్టు వేస్టు!" అంటూ నా సంగతి తేల్చిపారేశాడు శివరాం. 'వేస్టు' అన్న పదం ఎందుకు ఉపయోగించాడో అర్థం కాక ఊరికే ఉండిపోయాను.

"ఆయన కథ అంతేనని ఈ మూడేళ్లలో తెలుసుకున్నాం కదా! మనీషే దేవుడు అంటాడు. అది శాలూ, మానవ సేవే! మాధవ సేవ కదా! మనం దేవున్ని కొలిచీ, కొలిచీ స్వర్గానికి పోతామా ... అయనా - మనిషిని కొలిచీ స్వర్గానికి పోతాడు. అంతే!" అన్నాడు రాజేశ్వరరావు. అతనికి మైకం అప్పుడే కమ్ముతున్నట్లు వత్తి పలుకుతున్న మాటలే చెబుతున్నాయి.

నేను అతన్ని ఉడికించాలని - "సార్! సార్! ఎట్లయినా నాకు స్వర్గం తప్పదంటారా?" అన్నాను నవ్వుతూ.

"థప్పదయ్యా థప్పదు! అంథే! అదంథే!" అంటూ సిగరెట్టు వెలిగించుకోవడంలో ఉండిపోయా డతను.

"అది సరే, కరుణాకరం! మీరు క్రిస్టియనులు కదా! దేవుడంటే చెప్పలేనంత భక్తి ఉంటుంది మీ మతం వాళ్లకి. అసలు నువ్వెట్లా నాస్తికుడివైనావు?" అన్నాడు శివరాం. అతను అప్పటికే అరసీసా పైనే తాగి నిమ్మళంగా మాట్లాడుతుంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. ఫుల్‌బాటిల్ కొట్టినా ఏమాత్రం తడబడేలా లేడు.

నేను చిన్నగా నవ్వి, "ఏమో సార్! నేను దేవుడు లేడని అనుకున్నాను. ఇంతవరకూ అలానే అనిపిస్తోంది. ఒకవేళ దేవుడు ఉన్నట్లు రుజావు అయిందే అనుకోండి, అప్పుడు తప్పకుండా నమ్ముతాను!" అన్నాను.

అంతవరకూ గమ్మున అందరినీ పరిశీలిస్తున్న వెంకటేశం - "సార్! ఇప్పు డన్న మాట మాత్రం నేను నమ్మను. నువ్వెంత మొండివాడివి అంటే, సాక్షాత్తు ఆ ఏసు ప్రభువే వచ్చి ఇదిగో కరుణాకరం, నేనే నిజమైన ఏసునీ, పాపుల పాలిట రక్షకుడినీ నన్ను నమ్మవయ్యా! అని నీ గడ్డం పట్టుకున్నా నువ్వు నమ్మేవాడివి కాదు. ఊరికే ఎందుకు మాట్లాడతావు?" అన్నాడు నా వైపు చూసి నవ్వుతూ.

బేరర్ వస్తూనే వెంకటేశం భోజనాలకి ఆర్డరిచ్చాడు - "అందరికీ ఒక్కో చికెన్ ఫ్రై,



రెండు రెండు పరోటాలు, ఎగ్ బిరియానీ, చికెన్ కబాబ్!'' బేరర్ మమ్మల్ని లెక్కేసుకున్నట్టు చూసి వెళ్లిపోయాడు.

నైట్ క్వీన్స్ దగ్గర్లో ఎక్కడో విరిసినట్టున్నాయి. నెమ్మదిగా వీస్తున్నాయి పరిమళాలు.

తోటలో క్రోటన్ మొక్కల్ని అందంగా కత్తిరించి గోడలుగా ఏర్పాటు చేశారు హోటలు వాళ్లు. మా చుట్టూ నాలుగు క్రోటన్ గోడలూ, మధ్యలో గుండ్రటి టేబులూ, దాని చుట్టూరా పేము కుర్చీలలో జారగిలపడి మేమూ!

మాకు ఉత్తర దిశగా ఆరడుగుల స్తంభంపై మసక వెలుతురుతో ఉన్న డూమ్ లైటు.

"నిన్ను మీ ఇంట్లోవాళ్లు తిట్టలేదా?'' అన్నాడు వెంకటేశం.

"ఎందుకు తిట్టడం?'' అన్నాను నవ్వుతూ.

"ఎందుకంటావేం? నాస్తికుడి వైనందుకు. మా ఇంట్లో అయితే శనివారం రాత్రి ఉపవాసం చేయకపోతేనూ పండగలకి గుళ్లకి వెళ్లకపోతేనూ మా నాన్న తిట్టిన తిట్టు తిట్టకుండా మూడు గంటలు ఏకబిగిన తిడతాడు, సార్!'' అన్నాడు శివరాం.

నేను మరో సిగరెట్టు వెలిగించుకుని అన్నాను - "ఒక్కమాట చెబితే మీరు నమ్ముతారో, లేదో మరి! అసలు మా నాన్నకి నేనంటే ఎంత 'ఇది' అనుకున్నారూ! 'ఇది' అంటే గౌరవ మన్నమాట! ఎంతంటే, 'నేను చర్చికి పోను, నాన్నా!' అని ఒకసారి అన్నాను. 'నీ ఇష్టం' అన్నాడు. ఇంకోసారి - అంటే ఒక సంవత్సరం తర్వాత ననుకుంట ఏదో సందర్భంలో 'దేవుడు లేడు, నాన్నా! నేను నమ్మను' అన్నాను. 'నీ ఇష్టంరా! ఎవరి నమ్మకం వాళ్లది!' అన్నాడు. ఆయనకి నా మీద ఒకటే నమ్మకం - 'వీ డేదో బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చి ఉంటాడు' అని. దీన్ని ఆధారం చేసుకుని మతాచారాల్ని మరీ దెబ్బతీయాలని ఇంట్లో చెల్లెళ్లందరిచేతా బొట్టు పెట్టుకునేలా చేశాను. మొదట్లో కొంత వ్యతిరేకించినా, క్రిస్టియనులలో ఒక వర్గం వారైన రోమన్ కాథలిక్కులు బొట్టూ, తిలకాలకు వ్యతిరేకులు కారు అని చిన్న చిన్న లెక్చర్లిచ్చాను. దాంతో మెల్ల మెల్లగా అలవాటు చేసుకున్నారు. ఇవన్నీ మా నాన్న చూస్తూ ఊరుకున్నా డనే చెప్పాలి. నేను సమయం దొరికినప్పుడల్లా దేవుడి అవసరం మనిషికి ఎప్పుడూ ఉండదన్న విషయం గురించి చెబుతూ అమ్మనీ, చెల్లెళ్లనీ ఒప్పించేశాను. మా ఇంట్లో బయటి గదిలో ఆకాశం వైపు చూస్తూ ప్రార్థిస్తున్న క్రీస్తు పటం ఉండేది. ఓరోజు మా నాన్న ఆఫీసుకెళ్లాక దాన్ని తీసివేశాను. మా నాన్న ఏమనుకున్నాడో, ఏమో కానీ, ఏమీ ఎరగనివాడికిమల్లే ఉండిపోయాడు. నిజానికి, బ్రదర్! ఎవరి నాన్న అయినా మా నాన్నమాదిరి ఉంటాడా అనిపిస్తుంది. నేను మాత్రం ఈ విషయంలో చాలా అదృష్టవంతుణ్ని!''

"అయినా, కరుణాకర్ సార్! మీ నాన్న ఏమీ

అనడంలేదు కదా అని దేవుని పటాన్ని ఊడబీకడం ఏమీ బాగాలేదు. మీ రేమీ అనుకోకపోతే 'టూ మచ్' అనిపిస్తోంది మీ ప్రవర్తన!" అన్నాడు ఆంజనేయులు.

"ఎస్! ఇటీజ్ ట్టూమచ్!" అన్నాడు రాజేశ్వరరావు మైకం గొంతుతో.

'టూ మచ్' అన్నమాట ముల్లులా గుచ్చుకుంది. అయినా, తాగినవాళ్ల ఎదుట నేను ఏం మాట్లాడి నెగ్గగలను? గమ్మున సిగరెట్టు తాగుతూ ఉండిపోయాను. నా మొహంలో మార్పు గమనించినట్లున్నాడు వెంకటేశం. అందుకే అన్నాడు -

"ఇదిగో బ్రదర్స్! పార్టీ పేరుతో ఇక్కడ సరదాగా గడపాలని కదా వచ్చాము! మరి, ఇలా సీరియస్సు విషయాలు మాట్లాడేసి ఒకరినొకరు బాధపెట్టుకోవడం మంచిది కాదు, దయచేసి ఆ విషయాలు మాట్లాడవద్దండీ! ఏ సినిమాల గురించో, రాజకీయాల గురించో మాట్లాడుకుందాం! లేదంటే, మన ఆఫీసరు గారి ఏడుపు మొహం మీద మాట్లాడుకుందాం!"

"వద్దు, నాయనా! అంత పని మాత్రం చెయ్యొద్దు! ఇప్పటికే ఆయన ఏడుపు మొహం మీద కరుణాకరం 'వందెం' అనే కథ రాశాడు. ఇంకా మాట్లాడితే ఏకంగా నవలే రాసేస్తాడు!" అంటూ రెండు చేతులెత్తి భయపడ్డట్టు అభినయించాడు ఆంజనేయులు.

"అవును, బాస్! ఆ పని మాత్రం చెయ్యొద్దండి! నీకు దండం పెడతాను! ఆంధ్ర పాఠకులు నవ్వలేక చచ్చే ప్రమాదం ఉంది!" అంటూ రాజేశ్వరరావు తమాషాగా మొక్కుతుంటే నాకు నవ్వాగలేదు.

ఇంటి కొచ్చేటప్పటికి బాగా పొద్దుపోయింది. అర్ధరాత్రి మీరిపోయింది.

తలుపు తీయడమే తడవుగా వెళ్లి పడుకుంది ఎలిజా. పిల్లలు ప్రవీణ్, శ్రవణ్‌లు మంచి నిద్రలో ఉన్నారు.

నీలిరంగు బెడ్ లైటు ప్రశాంతంగా వెలిగిపోతోంది. నే నింకా ప్యాంటూ, షర్టూ విప్పేసి లుంగీ చుట్టుకుంటున్నాను. ఎలిజా అప్పటికే గుర్రుపెట్టి నిద్రపోతోంది.

పరుపు పైన అటూ ఇటూ దొర్లుతున్నానే కానీ, ఎంతకీ నిద్ర రావడంలేదు. ఏవేవో ఆలోచనలు. శ్రీశ్రీ రాసిన 'నిద్రకు వెలియై ...' కవిత జ్ఞాపకానికొచ్చి నవ్వుకున్నాను.

పార్టీలో అనవసరంగా పర్సనల్ విషయాల్ని అతిగా చెప్పానేమో అనిపిస్తోంది. విస్కీ తాగిన వాళ్లు ఎంతో బ్యాలెన్స్‌గా మాట్లాడుతుంటే, వెధవ కూల్‌డ్రింక్ తాగిన నేను ఏదో గొప్పలు చెప్పుకోబోయి ఏదేదో మాట్లాడేశాను. ఆంజనేయులు అన్నట్లు దేవుడిని వ్యతిరేకించే విషయంలో నిజంగా ఇంట్లో 'టూ మచ్'గా వ్యవహరించానా? ఒకసారి గతాన్నంతా గుర్తుకు తెచ్చుకున్నాను. అయినా నేను చేసిన పొరపాటు ఏమిటో నాకు అర్థం కావడంలేదు. ఈలోగా క్వార్ట్జ్ గడియారం సంగీతం వినిపించి, ఒంటిగంట కొట్టింది. బలవంతంగా కళ్లు మూసుకున్నాను.

*** *** ***

నన్ను ఎవరో గట్టిగా కుదుపుతున్నట్లు అనిపించి



## తల ఎత్తని వారు

రంగారావు: వంచిన తల ఎత్తని అమ్మాయిని చూడండయ్యా పేరయ్యా మా అబ్బాయికి. వెంటనే పెళ్లి చేసేస్తాను.

పేరయ్య: అలాంటి సంబంధం ఒకటి నా దగ్గర రెడీగా ఉందండి.

రంగారావు: అలాగా పెళ్లికూతురు ఏం చేస్తూ ఉంటుందేం?

పేరయ్య: చిత్తుకాగితాలు ఏరుకొంటూ ఉంటుంది.

రంగారావు: ? ? ?

కె.ఎస్.వి.ఎస్. శర్మ [ఏలూరు]

టక్కున కళ్లు తెరిచాను.

"ఏమండీ, !" ఆదుర్దా గొంతుతో ఎలిజా.

కంగారు పడిపోయి, "ఏమైందే?" అన్నాను.

లైటు వెలుతురు కళ్లను కుక్కుతోంది.

"ఏ ... ఏం లేదు, ... మామయ్యకి సీరియస్సుగా ఉందట!"

"ఎవరు చెప్పారే?" అన్నాను కంగారులో.

గుండె దడదడలాడటం మొదలుపెట్టింది.

"మాధ వన్నయ్య వచ్చాడు!"

మాధవ నాకు చిన్ననాటి మిత్రుడు. వాడు ఈవేళప్పుడు రావడమేమిటి? గోడ మీద గడియారం చూశాను. నాలుగున్నర అవుతోంది.

"ఏడీ వాడు?" అంటూనే మంచం మీద నుంచి లేచాను.

"బయటి గదిలో కూర్చుని ఉన్నాడు."

గబగబా బయటి గదిలోకి నడిచాను.

కేన్ కుర్చీలో తలకి మఫ్లర్ చుట్టుకుని ఉన్నాడు మాధవ.

"ఏరా! నాన్నకు ఏమైందిరా?" ఆత్రంగా అడిగాను.

"అన్నీ వివరంగా చెప్తాను, ముందు అందరూ బయలుదేరండి! బయట జీపు రెడీగా ఉంది. అమ్మా ఎలిజా! పిల్లల్ని లేపి తీసుకురా!" అంటూ ఎలిజాని తొందర పెట్టాడు.

నా కాళ్లకింద భూమి కదులుతున్నట్టూ, నిస్సత్తువ ఆవహించినట్లు ఉంది. అక్కడే కూలబడిపోవా లనిపిస్తూంటే అలా కుర్చీలోనే ఉండిపోయాను - చేష్ట లుడిగి.

"ఏమైందిరా నాన్నకు, చెప్పరా!" యాంత్రికంగా మళ్లీ అడిగాను.

"ఏం లేదురా, ఊంకే ఇదైపోవద్దు! నిన్న సాయంత్రం గుండె నొప్పిగా ఉందంటే హాస్పిటల్లో చేర్చారు. రాత్రి తొమ్మిది గంటలప్పుడు మీ పక్కింటి పిల్లోడు రాజారాం లేడూ, వాడు మా ఇంటికొచ్చి చెప్పాడు! నేను వెంటనే హాస్పిటల్‌కి పోయాను. అప్పటికే ఆయన కోమాలోకి వెళ్లిపోయాడు!"

"నాన్నకు గుండె నొప్పా! నా కెందుకు చెప్పలేదురా! ఫోన్ చేసి ఉండొచ్చు కదా!"

"ఎలారా తెలిపేది! మీ అమ్మా, చెల్లెళ్లూ మీ నాన్న దగ్గరే ఉండిపోయారు. నేను డాక్టరు రాసిచ్చిన మందులు తేవడంలో ఉండిపోయాను. ఇప్పుడు వీలు పడింది. వెంటనే జీపు మాట్లాడుకుని వచ్చేశాను. ఊఁ, తొందరగా పోదాం, రండి! మాటలు జీపులో మాట్లాడుకోవచ్చులే! తొందరగా పాంటు, షర్టూ వేసుకో!"

"ఇప్పు డెలా ఉంది నాన్నపరిస్థితి?"

"అలాగే ఉంది! ముందు రెడీ అవ్వండి!" అంటూ విసుగ్గా అన్నాడు వాడు.

మాధవ మాటల్లో ఏదో దాస్తున్నాడని నా మనసు కీడు శంకిస్తోంది. జరగరాని దేదైనా జరిగిందేమో! నే నేమైనా షాక్ తినవచ్చునని దాస్తున్నాడా వీడు!

"అలాగే ఉందంటే ఎలారా?" అన్నాను పాంటు వేసుకుంటూ.

"ఒరే! నేనేదో దాస్తున్నట్లు అనిపిస్తోంది కదా! నోర్మూసుకుని ఆ షర్టు తగిలించుకో! అమ్మా ఎలిజా! ముందు నువ్వూ, పిల్లలూ తయారవ్వండి! ఒరేయ్, కరుణా! తొందరగా రా!" అన్నాడు వాడు మాట మారుస్తూ. వాడి మొహంలో మార్పేమీ లేదు.

అయిదు నిముషాలలో అందరం యాంత్రికంగా అదరాబాదరా బట్టలు వేసుకున్నా మనిపించుకుని జీపులో కూలబడ్డాం.

ముందు సీట్లలో నేను, మాధవా, వెనుక సీట్లలోఎలిజా, పిల్లలు కూర్చున్నారు.

"తాతకి జరం వచ్చిందని ఎవరు చెప్పారు? మాధవా అంకుల్ రాత్రంతా నిద్ర పోలేదా? ఈ జీపు మాధవంకుల్ స్వంతమేనా?" అంటూ పిల్ల లిద్దరూ ఎలిజాని ప్రశ్నలతో వేధిస్తుంటే ఆవిడ ఏవేవో సమాధానాలు చెబుతోంది.

నల్లటి తారురోడ్డు మీద చీకటిని చీలుస్తూ అనంతపురంవైపు వెళ్తోంది జీపు. చెవులకి చలిగాలి ఈడ్చి కొడుతోంది. మాధవతో ఎన్నో మాట్లాడాలని ఉన్నా ఏమీ మాట్లాడలేకపోతున్నాను. సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తున్నాను - ఆలోచనలనీ, చలినీ దూరం చేసుకునేందుకు.

*** *** *****

తెలతెలవారుతుండగా అనంతపురం చేరుకున్నాం. కలెక్టరాఫీసు దగ్గర వెళ్తోంది జీపు.

"ముందు హాస్పిటల్‌కే పోదామండీ!" అంది ఎలిజా.

అంతవరకూ ఎక్కడికి వెళ్లాలని అనుకోలేదు. "సరే" అన్నాను.

"హాస్పిటల్‌కి ఎందుకూ, ఇంటికే పోదాం!" అన్నాడు మాధవ. వాడి గొంతులో నాన్నుడు వ్యవహారం ఉన్నట్లు అనిపించలేదు. గిరుక్కున వాడి వైపు చూశాను అనుమానంగా. వాడు ఎటో చూస్తున్నాడు.

"అంటే ... నాన్న ...!" అంతకంటే మరేమీ అనలేకపోయాను - వాడి నోటి నుంచి ఎక్కడ వినరాని మాట వినవలసి వస్తుందోనని జంకు.

"ముందు ఇంటికి పోదాం! ఊరికే ఇదైపోవద్దు!" అన్నాడు నావైపు చూడకుండానే!

**** **** *****

జీపు ఆగగానే కాంపౌండ్‌లోకి ఆత్రంగా అడుగు పెట్టాను. అక్కడ అప్పటికే గుంపులుగా జనం! నాకు పరిస్థితి అర్థమైపోయింది.

వరండాలో మంచం మీద నాన్న శవం! మెడవరకూ దుప్పటి కప్పి ఉంచారు. తల దగ్గర స్టూలు మీద కొవ్వొత్తి వెలుగుతోంది. ముక్కుపుటాల్లో దూది. నా కాళ్లల్లోంచి నరాలు జివ్వున లాగినట్లయింది. మెదడు మొద్దుబారినట్లనిపించింది. నేను వచ్చినట్టు తెలిసిన అమ్మ భోరున ఏడుస్తూ వచ్చి నన్ను గట్టిగా పట్టుకుని, "మీ నాయన పాయనప్పా! ఎళ్లిపాయ నప్పా!" అంటూ బొంగురు గొంతుతో ఏడుస్తుంటే కలలో జరిగిన సంఘటనలా ఉంది.

నేను తేరుకోలేకపోతున్నాను. అమ్మ ఏడుపుతో చెల్లెళ్లూ పెద్దపెట్టున ఏడుపు మొదలుపెట్టారు. ఎలిజా కూడా వాళ్లతోపాటు ఏడుస్తోంది. నేను ఇక తట్టుకోలేక గావుకేక పెట్టినట్టు "నాన్నా!" అంటూ ఏడ్చేశాను. భుజాల మీద చేతులు వేసి అక్కున చేర్చుకున్న మాధవను గట్టిగా పట్టుకుని భోరున ఏడుస్తూ, "ఒరే! నాన్నరా ... నాన్నరా!" అంటున్నానంతే! అప్పుడు నాకు ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో ఏదీ అర్థం కాని స్థితి! అలా ఎంతసేపు ఏడ్చానో! నెమ్మదిగా నా వీపు మీద చేతులు వేసి జబ్బ పట్టుకుని మెల్లగా పెరటి వాకిట్లోకి తీసుకెళ్లాడు మాధవ. కన్నీళ్లు తుడుచుకుంటూ కాసేపు శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాను. మాధవ సిగరెట్టు అందించాడు. వెలిగించుకున్నాను. యాంత్రికంగా పొగ పీలుస్తున్నాను.

ఉన్నట్టుండి నాన్న శవం జ్ఞాపకం వచ్చి జివ్వున కళ్లల్లోకి నీళ్లు! నా గొంతు కీచుపోయి ఏడుపు పొంగింది.

మాధవ ఒక్కసారి మెల్లగా గద్దించాడు - "రేయ్, కరుణా! నీ కసలు బుద్ధుందా! నువ్వేం చిన్నపిల్లాడివా! ఇంటికి పెద్ద కొడుకువి. నువ్వే ఇంత దిగులుపడిపోయి పసిపిల్లాడి మాదిరి ఏడుస్తుంటే అమ్మా చెల్లెళ్లూ ఏమైపోతారు? కొంచెం ఏడుపు ఆపి, తర్వాత ఏం చేయాలో చూడు!"

వాడి మాటలు నా కేం అర్థం కాలేదు. "అంటే?" అన్నాను.

"ఇప్పుడు మనం చేయాల్సిన పనిరా! గ్రేవ్ యార్డ్‌కు నాన్న శవాన్ని తీసుకుపోవద్దా!"

ఆ మాట వినగానే మళ్లీ దుఃఖం పొంగుకొచ్చింది.

"ఇదే, ఇలా ఏడుస్తుంటే లాభం లేదురా, కరుణా! ముందు మనం పోయి, మీ చర్చి పాస్టర్‌తో చెప్పివద్దాం!"

జేబు రుమాలుతో కళ్లు తుడిచేసుకుంటూ "పద, పోదాం!" అన్నాను.

**** **** *****

ఉదయం ఎనిమిది గంటలవుతోంది.

మోపెడ్‌లో చర్చి కాంపౌండ్ చేరుకున్నాం నేను, మాధవా.




రాధ: నిన్ను చూడటానికి వచ్చిన ఆ పెళ్లికొడుకు రచయితట కదా? నిన్ను ఏం అడిగాడు?
రమణి: నేను కన్యనేనని, ఇంతకుముందు ఎవర్నీ ప్రేమించలేదని హామీ పత్రం రాసిమ్మన్నాడు.
రాధ: ? ? ?

కె.ఎస్.వి.ఎస్.శర్మ [ఏలూరు]

ఆ కాంపౌండ్‌లో చర్చికి వెనకాల వైపు ఉంది పాస్టర్ గారిల్లు.

తీరా అక్కడికి వెళ్తే ఆ ఇంటికి తాళం వేసి ఉంది. ఆ ఇంటికి ఆరడుగుల దూరంలో ఉన్న కొట్టంలో నుంచి చర్చి ప్యూను భార్య ఏమో - ఏభై సంవత్సరాల మనిషి మమ్మల్నిద్దరినీ తన మందమైన కళ్లజోడులోనుంచి చూస్తూ బయటికి వచ్చింది.

"ఎవురు కావల్ల నాయినా?" అడిగిం దామె.

"పాస్టరు పాలయ్యగారమ్మా! ఎక్కడపోయినారు?" అడిగాను.

"పాస్టరుకి బంధువులా, నాయినా మీరు?" అందామె ఆసక్తిగా.

"కాదమ్మా! మా నాన్న రాత్రి చనిపోయాడు. పాస్టర్‌కి చెప్పి శ్మశానంలో స్థలం కోసం పర్మిషన్ అడిగేదానికి వచ్చాను" అన్నాను. ఆమె అడిగిన ప్రశ్నకి ఒక్క మాటలో 'అవును' 'కాదు' అని చెబితే సరిపోయి ఉండేది. అయినా ఎందుకో, ఎవరు కనిపిస్తే వాళ్లకి నా బాధ చెప్పుకోవాలనిపిస్తోంది.

"ఈ చర్చికి వచ్చే వాళ్లకే నాయనా, ఈ పాస్టరు పరిమీసను ఇచ్చేది. ఎవురికిబడితే వాళ్లకి ఇయ్యేరు!"

"మేము ఈ చర్చి వాళ్లమేనమ్మా!" అన్నాను.

"ఏమోనబ్బా! నీ మొగమే నేను చూసి ఉండ్లేదు కద, నాయనా! చర్చికి వస్తా ఉంటే సంఘమోళ్లు మంచికీ, చెడ్డకీ ఆదుకుంటారయ్యా!"

"వాడు ఈ ఊర్లో లేడులేమ్మా!" అంటూ మాధవ చెప్పడంతో, "సరే సరే అట్లయితే! రేతిరి పాస్టరయ్యకి రక్తపోటు ఎక్కువయిపోతే పెద్దాస్పత్రిలో నా మొగుడు జేర్పించినాడయ్యా! పొద్దున్నే నేను కూడా పొయ్యి ఒస్తి. ఆయనకి మనుసుల మింద గమనం లేదు, నాయనా! పాపం ఆయనకి పెండ్లాం, పిల్లలు లేరు గద నాయనా! చెల్లెండ్ల కొడుకులు అక్కడెక్కడో కర్నూలులో ఉండారంట! వాళ్లు మీరేనేమో అనుకుంటిలే! ఈడ ఆయనకి నా మొగుడూ, నేనే దిక్కు. ఆస్పత్రికి పోతారేమో పోండి, నాయనా!" అందామె నా మొఖంలోకి చూస్తూ.

తల ఊపి వెనుతిరిగాము.

నాస్తికత్వం పూర్తిగా జీర్ణించుకుని చర్చి పాస్టర్లనీ, గుళ్లల్లోని పూజార్లనీ తేలిగ్గా చూసే నాకు, ఒక చర్చి పాస్టరుతో అత్యవసరమైన పని పడింది - అనిపించి విషాదమైన నవ్వు పులుముకుంది నాలో. కాలం ఎంత విచిత్రమైనదో! చర్చి పాస్టరు కోసం నేను రావడం, ఆయన నాకు సహాయం చేసే స్థితిలో లేకపోవడం!

"ఎలారా ఇప్పుడు?" అంటూ మాధవ సిగరెట్టు వెలిగించాడు.

"ఎవ రేం చేసేదుందిరా! ఎలా జరిగేది అలా జరుగుతుంది!" అన్నాను.

వైరాగ్యంతోనైతే అన్నానే కానీ, 'ఎలా జరుగుతుంది?' అన్నది విడిపోని చిక్కు ప్రశ్నే. మా కుటుంబానికి సభ్యత్వమున్న చర్చి వాళ్లే నేను ఫలానా వాళ్లబ్బాయిని అని చెబితే కానీ గుర్తించలేదే! ఇక ఇతర చర్చి పాస్టర్లకు నేను క్రిస్టియన్‌ని అని చెప్పి మా నాన్న శవాన్ని శ్మశానంలో సమాధి చేయడానికి పర్మిషను ఇవ్వమంటే ఇస్తారా?

ఈ విషయం తలపులోకి రాగానే నా గుండెల్లో రాళ్లు పడ్డట్టు అనిపించింది. అదే మాట అన్నాను మాధవతో. వాడు గమ్మున సిగరెట్టు పీలుస్తూ చర్చి కాంపౌండ్ బయటికి నడక సాగించాడు. నేను వాడిని అనుసరించాను.

మోపెడ్ స్టార్ట్ చేస్తూ అన్నాడు మాధవ - "ఒరే! ఎందుకైనా మంచిది, ఇక్కడికి దగ్గరలో దాసునగర్‌లో ఓ చర్చి ఉంది. దాని పే రేదో నాకు తెలియదు. అక్కడికి పోయి ఆ చర్చి పాస్టర్‌తో ఉన్న విషయం చెప్పేద్దాము. ఈ చర్చి పాస్టరు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినందువల్ల మాకు ఈ సహాయం చేయమని అడుగుదాం. ఇది చావుకు సంబంధించిన విషయం కదా! తప్పకుండా మనకి పర్మిషన్ ఇవ్వొచ్చు! ఓసారి ప్రయత్నించడంలో తప్పు లేదు కదా!"

మోపెడ్ స్టార్టయింది.

కొంత ధైర్యం వచ్చింది. "ఊఁ, పద!" అంటూ మోపెడ్ మీద వెనకాల కూర్చున్నాను. పది నిముషాల్లో ఆ చర్చి చేరుకున్నాము.

మా సంఘపు చర్చి కంటే పెద్దదిగా, అందంగా ఉంది. దాదాపు పదిహేను ఎకరాల విస్తీర్ణం ఉన్న ఆవరణ ఉంది ఆ చర్చికి. అక్కడక్కడా అందమైన క్రోటన్ మొక్కలు, ఓ పద్ధతిలో పెంచిన పూలమొక్కలు, అక్కడొక్కటీ, ఇక్కడొకటీ సరుగుడూ, వేపా, రావీ, చింత చెట్లూ ఉన్నాయి. ఆ వాతావరణం చూశాక నాకు అంతవరకూ ఉన్న బాధ కొంత ఉపశమించినట్లు అనిపించింది. గుళ్లు, చర్చిలు, మసీదులు మానసిక ప్రశాంతి నిస్తాయంటారు. ఇదేనేమో!

ఆ ఆవరణలోనే ఒక చిన్న అందమైన ఇల్లు

చూడముచ్చటగా, ఆధునికంగా ఉంది. అదే పాస్టర్‌గారి ఇల్లు అయిఉంటుందని అక్కడికి వెళ్లాము. ఇంటికి ఇరువైపులా ఉన్న అరుగుల మీద వంక్తులు తీరి ఉన్నాయి పూలమొక్కల కుండీలు. బయట ఎవరూ లేరు. మాధవ కాలింగ్ బెల్ నొక్కాడు. ఎర్రగా, బొద్దుగా నీలిరంగు గౌను వేసుకున్న ఆరేళ్ల పాప వచ్చింది. "ఎవరు కావాలండీ!" అడిగింది ముద్దుగా.

"పాస్టరు గారు, పాపా!" అన్నాడు మాధవ.

"ఓహో! డాడీ కావాలా! పిలుస్తా నుండండి!" అంటూనే, "డాడీ! డాడీ!" అని అరుస్తూ లోపలి కెళ్లింది.

కొన్ని నిముషాల తర్వాత లావుగా, ఎత్తుగా, చామనచాయలో ఉన్న బట్టతల మనిషి లుంగీ, బనియనుతో వచ్చాడు. అతని మొహంలో నవ్వులేదు కానీ, వీ ళ్లెవరై ఉంటారా అన్న అనుమానం మాత్రం ఉంది.

"ఎవరు కావాలండీ!" అడిగాడు సోడాబుడ్డి అద్దాల్ని ముక్కుపైకి తోసుకుంటూ.

"పాస్టరు గారు కావాలి సార్!" అన్నాడు మాధవ.

"నేనే. ఏం?"

"నరేసార్, మీతో పని ఉండి వచ్చాం, సార్!" అన్నాడు మాధవ.

"నాతోనా ఏం పని? అలా కూర్చోండి!" అంటూ అరుగు చూపించాడు.

"పరవాలేదులెండి, వీడు నా ఫ్రెండ్ కరుణాకరం! వీళ్లు క్రిస్టియనులు సార్! రాత్రి వీళ్ల నాన్న హాస్పటల్‌లో చనిపోయాడు, సార్!"

"ఈ ఊరేనా?"

"అవును, సార్!" అంటూ ఉన్న విషయం వివరిస్తూనే, మా చర్చి పాస్టరు ఆస్పత్రిలో చేరిన సంగతి కూడా వివరించాడు.

"ఎవరు ... పాల్ గారా? అరెరే! ఎంత పనయింది! అయితే ఒక పని చేయండి. మీ చర్చి సెక్రటరీని పర్మిషన్ ఇవ్వమనండి. అతనికీ అధికారముంది పర్మిషన్ ఇవ్వడానికి. పర్మిషన్ అంటే ఏమీ లేదు, ఇరవై రూపాయలు కట్టించుకుని రసీదు ఇస్తారు. దాన్ని మీరు శ్మశానానికి తీసుకుపోతే అక్కడ గ్రేవ్‌యార్డ్ వాచ్‌మన్ ఉంటాడు. అతను స్థలం కేటాయిస్తాడు. ఒక నూర్రూపాయలు ఇచ్చి వస్తే సరి, వాళ్లే మీరు శవపేటిక తీసుకువెళ్లేలోగా గుంత తీసి రెడీగా ఉంచుకుని ఉంటారు!" అని టకటక చెప్పేస్తూ పోతున్నాడు: పాస్టర్.

అసలు మా చర్చి సెక్రటరీ ఎవరో తెలియదే! ఏం చేయడమా అని అనుకుంటూ ఉండగానే మాధవ అన్నాడు - "ఆయన ఊళ్లో లేడట సార్!" అని.

"అలానా!" అని పాస్టరుగారు అంటున్నట్టే మాధవ అందుకున్నాడు మాటల్ని -

"అందుకే సార్! గ్రేవ్‌యార్డ్‌లో పర్మిషన్ ఇచ్చి, సమాధి వద్ద ప్రార్థన చేసేదానికి మీరు వస్తే మీకు ఋణపడి ఉంటాం సార్!" అంటూ గబగబా అన్నాడు.

"నేనా! పర్మిషనా! నేను 'సమాధి ఆరాధన' చేసేందుకు రావడమా! ఇదో అబ్బాయిలూ! మీరు తెలిసే మాట్లాడుతున్నారా ఇవన్నీ!



"ఆ ఇద్దరు రాజకీయనాయకులు కలవడం వల్ల మనకేం లాభం?" సుందరం గోపాలంతో అన్నాడు.

"ఇద్దరికీ ఒకే పూలదండ వేసెయొచ్చు" చెప్పాడు గోపాలం.

పుట్రేవు శేషాచలపతిరావు [శ్రీకాకుళం]

ఇలాంటి విషయాలు చూడటానికి చాలా మామూలు విషయాల మాదిరి కనిపిస్తాయి కానీ, చాలా సీరియస్సండీ! ఎవరి చర్చి పాస్టరు వాళ్ల సంఘ సభ్యునికే పర్మిషన్ ఇవ్వాలి, ప్రార్థన చేయాలి. నే నెలా చేస్తాను? అసలు మీరు, మీ కుటుంబం వాళ్లు క్రిస్టియన్లని మీరు చెప్పేస్తే నమ్మడమేనా నేను! మీరు క్రిస్టియన్లని గ్యారంటీ ఏమిటి? వెరీ వెరీ సారీ మిస్టర్! నేని ఇలాంటి కేసుల్ని ఎప్పుడూ టేకప్ చేయలేదు. అన్య సంఘసభ్యులకి నేను పర్మిషన్ ఎప్పుడూ ఇవ్వలేదు."

"సార్! సార్! మీరే ఇలా అంటే ఎలా సార్! మన మతం వాళ్లని మన మతం వాళ్లే ఆదుకోకపోతే ఇంకెవరు ఆదుకుంటారు సార్!" అన్నాను అక్కడికైనా ఆయనలో మార్పు వస్తుందేమో నని ఆశ.

"మీరు ఆర్డనరీ ఫెలోసండీ! మీకు మా అవస్థలు అర్థం కావు. నేను బాధ్యత గల పాస్టర్‌గా ఇలాంటి పనులు చేసి మా సంఘం 'డీకన్స్'కి - అంటే సంఘ పెద్దలకి సంజాయిషీ ఇచ్చుకునేటట్లు ఉండటంఎంత అసహ్యకరంగా ఉంటుందో మీకు తెలియదు! కాబట్టి మీకు నేను ఎటువంటి సహాయమూ చేయలేను. మీకు వచ్చిన సమస్యను ఆ ప్రభువే తీర్చాలి! నాకు వేరే పని ఉంది, వస్తా!" అంటూనే టక్కున లేచి ఇంట్లోకి వెళ్లిపోయాడు.

నీలి రంగు గౌను పాప తలుపును ఆనుకుని మమ్మల్ని చూసి అమాయకంగా నవ్వుతూ "టాటా!" చెబుతోంది చేత్తో.

నాలో దుఃఖం తన్నుకుని వస్తూండగా పాప వైపు చూసి చెయ్యెత్తి మెల్లగా ఆడిస్తూ కదిలాను. నాన్న శవాన్ని గ్రేవ్ యార్డ్‌కు తీసుకుపోవడానికి ఏ పాస్టరూ పర్మిషన్ ఇవ్వడు. సమాధి ప్రార్థనా చేయడు. చివరికి మునిసిపాలిటీ వాళ్లకి అప్పచెప్పాల్సి వస్తుందా? ఈ విషయం అనుకుంటూనే వెన్నులోనుంచి చలి పుట్టుకొచ్చి గజగజ వణికిపోయాను.

"ఇవ్వు డెలారా చేసేదీ, ఈ ఊళ్లో ఉన్న చర్చిల పాస్టర్లంతా ఇదే రకంగా మాట్లాడతా రంటావా! మా హిందువులదే మేలురా! ఎవరినీ అడిగే పని లేదు. పులి పోయి గిలి అంటుకుంది మనకి. పోనీ నువ్వు ఇష్టపడే నాస్తికులకీ, హేతువాదులకీ, కమ్యూనిస్టులకీ శ్మశానా లున్నాయా అంటే - ఊహు! ఎంతసేపూ స్టేజీలెక్కి ఉపన్యాసా లివ్వడమే! తీరా ఇలాంటి సమస్యలు వస్తే ఎవరి మతం వాళ్లది, ఎవరి ఆచారం వాళ్లది!" అంటూ మాధవ మాట్లాడుతూ ఉంటే గమ్మున ఉండిపోయాను.

"పోనీ ఒక పని చేస్తేనో!" అన్నాను.

"ఏం పనిరా!" ఆత్రంగా అన్నాడు మాధవ.

"మా దానియేలు మామ దగ్గర ఉన్న విషయమంతా చెప్పేసి, నువ్వే గతి మాకు అని అంటే? ఏమైనా అననీ, ఇప్పుడు ఇంతకంటే వేరే మార్గం కనబడటం లేదురా!" అన్నాను.

"మరి ముందుగా ఆ మాట చెప్పి ఉంటే ఎంత బాగుండేది! ఇన్ని అవస్థలు పడేవాళ్లం కాదు కదా! పద మరి, ఆలస్యమెందుకు?" అంటూ ఉత్సాహం తెచ్చుకుని మోపెడ్ స్టార్ట్ చేశాడు మాధవ.

దానియేలు మామ మా మేనత్త పెనిమిటి. ఆయన ప్రకాశ్‌నగర్‌లో ఓ క్రైస్తవ సంఘం పెట్టుకుని చిన్న చర్చిని మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు. దానియేలు మామ 'వీర క్రైస్తవుడు'. ఆయన సంఘం వాళ్లు 'వీర క్రైస్తవులు'. ఆ పేరు పెట్టింది నేనే! ఎందుకంటే తక్కిన సమాజానికి మామూలుగా కనిపించే సినిమాలూ, సిగరెట్లు, తాంబూలం - ఇవన్నీ గొప్ప దురలవాట్లుగా వాళ్లు పరిగణించి నిషేధిస్తారు. అలాంటి అలవాట్లు ఉన్నవాళ్లు దేవుడిని నమ్మడానికి అనర్హులనీ, వాళ్లు ఎన్ని పుణ్యకార్యాలు చేసినా ఆ పాడు అలవాటు ఉన్నందువల్ల మరణానంతరం నేరుగా నరకానికే పోతారని వీర క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. దానియేలు మామ కొత్తగా చర్చి పెట్టిన రోజుల్లో తన చర్చికి రావలసినదిగా మా నాన్నకి ఎంతో నచ్చచెప్పి చూశాడు. "మా చర్చి మమ్మల్ని మంచి మనుషులుగా గుర్తిస్తున్నంతకాలం మేము ఏ చర్చికీ వెళ్లము" అని నిక్కచ్చిగా చెప్పేశాడు నాన్న. అప్పటినుంచి మామకు, మాకూ సరిగ్గా మాటలు లేవు. మా అత్తయ్యని కూడా మా ఇంటికి సరిగ్గా రానిచ్చేవాడు కాదు.

"ఎక్కడికిరా పోనిస్తున్నావు!" అన్నాను - వాడు ప్రకాశ్‌నగర్ వైపు మోపెడ్ మళ్లిస్తుంటే.

"మీ దానియేలు మామ ఇంటికి."

"ఆయన ఎప్పుడో మనింటికి వచ్చేసుంటాడు. పద, ఇంటికి పోదాం! ఒకవేళ అప్పటికీ రాకపోతే అప్పుడు చూద్దాంలే!" అన్నాను.

**** **** *****

ఇంటికి చేరుకున్నాం. అప్పటికి పది గంటలవుతోంది.

అప్పటికే మనుషులతో రద్దీగా ఉంది మా కాంపౌండ్. మా పల్లె నుంచి చాలామంది కావాల్సినవాళ్లు అందరూ వచ్చేశారు. అందరూ నన్ను సానుభూతిగా పలకరించారు.

వరండాలో నాన్న శవం!

అటువైపు చూస్తే గుండెల్లో కలుక్కుమంటోంది.

"మా దానియేలు మామ వచ్చాడా?" అని మా పల్లె అతన్ని అడిగాను.

"అద్దో అవ్వయ్యా! సెట్టుకింద కూకొని ఏదో దేవుని బోద జేత్తా ఉండాడు నూడు! యాటికొచ్చినా ఇదే పని! ఇంట్లో వాళ్లని వేదార్చేది లే! ఊళ్లోవాళ్లకి ఏసు పెబువు నమ్మితే మోచ్చమిప్పిస్తాడంట అని బోధ!" అంటూ అతను గొణుగుతూ ఉంటే వేప చెట్టు కిందకి నడిచాను - అయన చుట్టూ చేరిన పల్లె వాళ్లని తోసుకుంటూ.

"దేవుని మహిమలు చాలా గొప్పవి! ఏసు ఏమంటాడో తెలుసా! లోక పాపములు మోసుకుని పోవుచున్న సమస్తమైనవారలారా! నా యొద్దకు రండు, మీకు విశ్రాంతి కలుగజేతును అంటాడు!" అంటూ కొనసాగుతోంది అయన బోధన. నన్ను చూడగానే కొన్ని సెకన్లు నిలిపేశాడు మాటలు. ఈయన మత ప్రచారం ఇలాంటి చోటికొచ్చినా ఆగదా! నాకు చిర్రెత్తుకొచ్చింది. అయినా అణుచుకున్నాను - అసలు పని కుంటుపడుతుందని.

"మామా! ఒకసారి ఇలా వస్తావా?" అన్నాను.

"ఏమిరా! ఏమి?" అంటాడే కానీ, కుర్చీలో నుంచి లేవడు.

"కొంచెం ఇలా రా, మామా!" అన్నాను దీనంగా.

ఏమనుకున్నాడో, ఏమో కానీ, లేచి వచ్చాడు. కొబ్బరి చెట్టువైపు తీసుకెళ్లి జరిగిన విషయమంతా ఏకరువు పెట్టాను. నీవే దిక్కన్నాను, నీదే భారమన్నాను. ఈ గండం ఎలాగైనా నరే గట్టెక్కించమన్నాను! నీ మేలు ఈ జన్మకి మరిచిపోనన్నాను.

అంతా విని, "ఇప్పుడు తెలిసిందేరా, పిల్ల కాకీ! ఉండేలు దెబ్బ అంటే! ఏ కష్టమూ రానంతకాలం దేవుడూ లేడూ, గీవుడూ లేడూ అంటూఉంటివే! మా చర్చికి రమ్మంటే రానని మొగమ్మీద కొట్టినట్టు అన్నాడే మీ నాయన. ఇప్పుడు చూడు, చచ్చిపోయిన మీ నాయనకి ఏ గతి పట్టిందో! మీరు పోయే చర్చియే ముఖ్యమైపోయె మీ నాయనకి! ఇక నువ్వు చూస్తే నాస్తికత్వం, హేతువాదం - చర్చీ లేదు, గిర్చీ లేదూ! అదేందో మనిషే దేవుడట! మానవత్వమే మతమట! అని ఈ పెద్దమనిషి వాదించింది వాదించిందే! పైగా మతం మత్తుమందుఅని ఎద్దేవా చేస్తాండేవాడివిగా! ఇప్పుడు కనబడిందా పిల్లోనికి - పావం!" అంటూ గట్టిగా అంటున్నాడు.

నాకు విపరీతంగా కోపం వచ్చేసింది. "మామా! జరిగిపోయిన దాంతో ఏం పని! నాయన చచ్చిపోయినాడన్న 'ఇది' కూడా ..."

"చచ్చిపోతాత్ర్రా! ఎవరైనా ఈ భూమ్మీదే కట్టగట్టుకుని ఉండరు! అంతా ఏదో ఒకనాడు ఆ దేవుని సన్నిధికి చేరుకోవాల్సిందే!"

"నీ మాట కాదనను! గ్రేవ్ యార్డ్‌లో పర్మిషను, శవానికి సమాధి ఆరాధనా - ఇవన్నీ ..." అంటూ ఎంతో దీనాతిదీనంగా అడిగాను.

"ఆహా! గ్రేవ్‌యార్డు పర్మిషనా! మీ చర్చి పాస్టరు అయితేనే మీకు పర్మిషను ఇచ్చేది, ప్రేయరు చేసేదీ! మీ రెవరూ మా చర్చికి రారు కదా! సారీ! నేను దేవుని బిడ్డని, నా సంఘం వాళ్లకి అన్యాయం చేయలేను! నా చర్చికి రాని నా బంధువులకి పర్మిషన్ ఇస్తే, రేపొద్దుట మా సంఘ సభ్యుడు తన బంధువు వేరే మతం మనిషి చనిపోయాడని గ్రేవ్ యార్డ్‌లో పర్మిషన్ ఇవ్వమని వత్తిడి తెస్తాడు. నెవర్! నేను ఇవ్వను. మీ చర్చి పాస్టరు ఆస్పత్రిలో ఉన్నాడు కదా! ఈపాటికి కోలుకుని ఉంటాడు. పోయిరా, పో! అయినా, ఆయన నువ్వు పోతే నిన్ను గుర్తుపట్టాలి కదా! ఎన్నడైనా చర్చికి పోయుంటేగా!" అంటూ బిగ్గరగా మాట్లాడి, మళ్లీ వేప చెట్టుకిందకి పోయి కుర్చీలో కూర్చున్నాడు.

యాంత్రికంగా నాన్న శవంవైపు అడుగులు వేస్తున్నాను.

ఇదంతా వరండాలోనుంచి అమ్మా చెల్లెళ్లూ భయాందోళనలతో చూస్తున్నారు. అత్తయ్య మాత్రం గబగబా నా దగ్గరికి వచ్చింది, "ఇదిగో కరుణా! మీ మామ ఉత్త చాదస్తం మనిషి! అలాంటి మనిషి నీకు అవసరానికి పనికిరాడు!" అంటూ అత్తయ్య నా గడ్డం పట్టుకుని కళ్లల్లో నీళ్లు కుక్కుకుంది.

కోపం తెచ్చుకోవాల్సిన సమయం కాదు. ఏం చేయాలో తెలియక గిరుక్కున తిరిగి ఇంట్లోకి వెళ్లాను. భోరున ఏడవటం మినహా ఏమీ చేయలేకపోతున్నాను. మాధవ ఎక్కడ కెళ్లాడో! దిక్కు తోచడంలేదు.

మెత్తగా భుజం మీద చేయి పడితే తిరిగి చూశాను. బాలరాజుగారు దయగా చూస్తూ, "కరుణా! ఏడవద్దయ్యా! నీ కష్టం నాకు తెలిసింది. అంతా మాధవమూర్తి చెప్పాడు. మా చర్చి పాస్టరు నుంచి గ్రేవ్‌యార్డ్ పర్మిషను తెమ్మని. అలాగే ఆయనను సమాధి ఆరాధనకు అటెండ్ కావాల్సిందిగా మా అబ్బాయికి చెప్పి పంపించాను. అలాగే వచ్చేటప్పుడు శవ పేటికక్కూడా ఆర్డరు ఇచ్చి రమ్మన్నాను. సరేనా!" అన్నారు.

నిజంగా నాస్తికుడినైన నాకు ఆ సమయంలో ఆయనలో దేవుడు కనిపించాడు. కృతజ్ఞతతో కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతూండగా ఆయనను కౌగిలించుకున్నాను. ఆయన మెల్లగా వీపు తట్టాడు.

*** *** ***

మధ్యాహ్నం 12 గంటలయింది.

మా కాంపౌండ్ బయట నిల్చున్నాను. బాలరాజుగారు నన్ను ఓదార్చడానికేమో, మా నాన్నతో తనకు ఉన్న పరిచయం గురించి, నాన్న మంచితనం గురించి చెప్పుకుపోతున్నారు. ఉన్నట్టుండి, "కరుణాకరం! అదిగో, మా జాన్ వచ్చేశాడు!" అన్నారు.

వెనక్కి తిరిగి చూశాను.

"ఏమన్నాడురా మన పాస్టరు!" అడిగాడు బాలరాజు జాన్‌ని.

"ముందు కొంచెం గొణిగాడు, నాన్నా! ఏందబ్బా, ఎవరి సంఘంవాళ్లో చనిపోతే నేనెందుకు రావాలి? పర్మిషనెందు కివ్వాలి? మీ నాయన యాడ ఉండాడు! క్రిస్టియన్‌లు ఎవరు కష్టపడుతున్నా మనం సాయం చేయాలని మీ నాయన మొండివాదం! మీ నాయన మీద ఉండే గౌరవంతో వస్తాను. ఈ మాటే చెప్పు మీ నాయనతో అని అన్నా డాయన. గ్రేవ్‌యార్డ్ పర్మిషన్‌కి ఇరవై రూపాయలు కట్టేశాను. ఇదుగో, రసీదు కూడా ఇచ్చాడు! మూడున్నరకల్లా ఇక్కడి కొస్తాడట పాస్టరు!" అన్నాడు జాన్.

"మరి పెట్టె ఎప్పుడిస్తారట! పాస్టరు వచ్చేటప్పటికి అది ఇక్కడ ఉండాలి. శవాన్ని అందులో ఉంచుతూనే ప్రార్థన చేయాలి కదా!"

"రెండున్నర గంటలకల్లా ఇస్తానన్నాడు కార్పెంటర్. నేను దగ్గరుండి చేయించుకొస్తానే, నాన్నా! ఇప్పుడు గ్రేవ్‌యార్డ్‌కు వెళ్లి గుంత తవ్వించమని చెప్పేసి వస్తా! నూర్రూపాయలు కావాలి. అందుకే వచ్చాను" అంటూ జాన్ నన్ను అడగాలా, వద్దా అన్నట్టు సంశయిస్తున్నాడు.

నేను నూరు రూపాయలు జాన్‌కు ఇస్తూ, "థాంక్స్ జాన్!" అన్నాను.

"దానిదేముందిలే, అన్నా!" అంటూ



వెళ్లిపోయాడు.

"అంతే నాయనా, కరుణాకరూ! ఏ చర్చి పాస్టరయినా అంతే మరి! వాళ్లకి ఒక సంఘం ఉంటుంది. ఆ సంఘానికి డీకన్స్ ఉంటారు. ఆ డీకన్సు తమని ఎక్కడ ప్రశ్నిస్తారో నని ఈ పాస్టర్ల భయం. అసలు ఎవరైనా దేవుడికి భయపడరు! సంఘానికే భయపడేది! నువ్వు దేవుడే లేడనే మనిషివని తెలుసు నాకు. మనిషే దేవుడనే వాడివి నువ్వు! దేవుడు లేకపోయినా సంఘం అంటూ ఒకటుంది కదయ్యా! ఒక సంఘం వాళ్లది ఒక మతం అన్నమాట! మతం ఎలాగూ ఏదో ఒక దేవునిదై ఉంటుంది. అది వేరే సంగతి. నీ సంఘం నిన్ను దేవుని చిహ్నం ద్వారానే గుర్తిస్తాం దన్నమాట! ఇదే హిందువులకి, నీకు వచ్చిన కష్టం ఎప్పుడూ రాదు. ఎందుకనీ - వాళ్లది మెజారిటీ వర్గం కదా! నువ్వే ! మైనారిటీవి. ఇది జ్ఞాపకం పెట్టుకో! మా పాస్టరు నా మాట కాదనలేడు కాబట్టి వస్తాడు, రాకేం చేస్తాడు?" అంటూ చెబుతూనే ఉన్నారు బాలరాజుగారు.

****** ***** ******

అప్పటికే పొద్దుకుంకుతోంది.

నాన్న శవపేటికను గ్రేవ్‌యార్డులో సమాధి చేయడం అయిపోయింది. సమాధి అరాధనను కొనసాగిస్తున్నాడు పాస్టరు. నాకు ఏడుపు ఆగటంలేదు. కన్న తండ్రిని మట్టిల్లో కలిపేసిన పుట్టెడు దుఃఖం భరించలేకపోతున్నాను.

బాలరాజు నా భుజాల మీద చేతులు వేసి ఓదారుస్తూ అక్కడ ఉన్న గుంపు నుంచి కొద్ది దూరం తీసుకుపోయాడు. అక్కడికి కూడా పాస్టరు ప్రార్థన, మధ్యలో మా చెల్లెళ్ల ఎక్కిళ్లు వినిపిస్తున్నాయి.

"అయ్యా కరుణా! నీతో ఒక్క మాట చెప్పాలనుకున్నాను!" అన్నాడు. గంభీరంగా ఉన్నది అతని గొంతు.

'ఏమిటది?' అన్నట్లు చూశాను.

"ఇన్నాళ్లూ ఇంటికి పెద్దవాడు మీ నాన్న ఉన్నాడు. అయన ప్రభువుని చేరుకున్నాడు. ఇక ఇంటికి మగ దిక్కు నువ్వే! మునుపైతే నువ్వు తండ్రిచాటు పిల్లాడివి. నాస్తికత్వం, హేతువాదం, నమసమాజం అంటూ తిరిగేవాడివి. ఇప్పుడు కూడా అవన్నీ నిన్ను వదులుకోమనడంలేదు. నిన్నూ నీ కుటుంబాన్నీ గుర్తించే సంఘం - శుభాలకీ, అశుభాలకీ ఆదుకునే సంఘం ఒకటుంది అని నువ్వు గుర్తు పెట్టుకో! అది మతం తాలూకు దేవుని సంఘం కావచ్చు. ఇక్కడ దేవుడికంటే సంఘం ముఖ్యం. నిన్ను కష్టాల్లో దేవుడు ఆదుకుంటాడో, లేదో కానీ, మంచికీ, చెడ్డకీ, పెళ్లిళ్లకీ, చావులకీ ఆదుకునేది నీ సంఘమే. నీకు ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు - పెళ్లి కావలసినవాళ్లు. ఇలా పిల్లాటలతోనే నువ్వుంటే ముందు ముందు చాలా కష్టపడతావు. ఇదీ పెద్దవాడుగా నేను చెప్పేది. ఆలోచించుకో!" అని చెప్పి, మళ్లీ గుంపు వైపు తిరిగాడు బాలరాజు.

సమాధి ఆరాధన ముగిసింది. పాస్టరు, బాలరాజు మరికొందరు శవపేటిక తీసుకువచ్చిన జీపులో ఎక్కారు. చెల్లెళ్లూ, బంధువులూ ఆటోలలో వెళ్లిపోతున్నారు. నేను, మాధవా మోపెడ్ మీద ఊరివైపు బయలుదేరాం. పాత ఊళ్లో వెళ్తున్నాం. "ఒరే, ఆపరా!" అన్నాను.

వాడు టక్కున ఆపి, "ఏరా?" అన్నాడు.

"కొంచెం ఉండు!" అంటూనే మోపెడ్ దిగి దగ్గర్లోనే ఉన్న ఫ్రేమ్ వర్క్సులో అడుగు పెట్టాను. మాధవ కూడా వచ్చాడు.

ఫ్రేమ్ వర్క్సునిండా రకరకాలైన దేవుళ్ల పటాలు ఉన్నాయి. వాటిలో ఆకాశంవైపు దీనంగా చూస్తూ మోకరిల్లి ప్రార్థిస్తున్న ఏసుపటాన్ని కొన్నాను. మాధవ ఆశ్చర్యంగా నా వైపు చూశాడు. గమ్మున మోపెడ్ మీద కూర్చున్నా మాధవ ఆ పటం గురించి అడగలేదు, నేను చెప్పనూలేదు!

రద్దీగా ఉన్న జనంలోనుంచి మోపెడ్ ముందుకు సాగుతోంది.

★

### మహిమ

శతాబ్దాలుగా ఆ అద్భుతం సంవత్సరానికి రెండుసార్లు తంచనుగా జరిగిపోతూనే ఉంది. ఆదేమంటే ఎప్పుడో నాలుగవ శతాబ్దంలో గడ్డకట్టిన రక్తం ద్రవంగా మారడం! నాలుగవ శతాబ్దంలో నేపుల్స్‌లో జీవించిన ఒకానొక ఇటాలియన్ సన్యాసి రక్తమట అది. ఒకవేళ ఎప్పుడైనా కనుక ఆ రక్తపుగడ్డ కరిగి ద్రవించకపోతే ఏదో పెద్ద ఉపద్రవం ముంచుకువచ్చేస్తుందని విశ్వాసం కలవారి నమ్మకం. అందుకే ఇటలీలోని రోమన్ కాథలిక్కులు రక్తం గడ్డ కరిగిందన్న వార్త కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తూంటారు. వార్త వెలువడగానే హాయిగా... ఊపిరి పీల్చుకుంటారు. పండుగ జరుపుకుంటారు. ఈ యేడు నవంబర్‌లో ఆ రక్తం కరగ్గా 300 వందల మంది ఆ వేడుకల్లో పాల్గొన్నారని ఆర్చ్ బిషప్ మైకేల్ జియోర్డానో ప్రకటించారు.

అసలిలా రక్తపు గడ్డ కరగడమేమిటాని ఇటాలియన్ శాస్త్రవేత్తలు ఎంతగా తలలు బద్దలు కొట్టుకున్నా రహస్య భేదనం మాత్రం జరగలేదు!

